క్లుప్తంగా

28న మండల సమావేశం

సిద్దవటం : సిద్దవటం మండల పరిషత్‌సర్వ సభ్య సమావేశం ఈ నెల 28వ తేదీన జరుగుతుందని ఎంపీడీఓ ఫణిరాజకుమారి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె మాట్లాడుతూ సిద్దవటం మండల సర్వసభ్య సమావేశం 28వ తేదీ ఉదయం 10.00 గంటలకు ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ అధ్యక్షతన ఉంటుందన్నారు. ఈ సమావేశంలో అన్ని శాఖల పనితీరుపై చర్చ జరుగుతుందని, అధికారులు, మండలంలోని ప్రజాప్రతినిధులు సమావేశానికి తప్పక హాజరుకావాలని తెలియజేశారు.

పోలీస్ స్టేషన్‌లో వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఎస్ఐ

సంబేపల్లె : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం అగర్వాల్ కంటి ఆసుపత్రి వైద్యులు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు. పోలీసులతో పాటు పలువురికి కంటి పరీక్షలు చేశారు. కంటి చూపు సక్రమంగా లేనివారికి మెరుగైన వైద్యపరీక్షలు నిమిత్తం అగర్వాల్ ఆసుపత్రికి రెఫర్ చేశారు.

రెపరెపలాడిన తిరంగా



తిరంగా ర్యాలీలో ప్రజలు

నందలూరు : ఆపరేషన్ సిందూర్ ఘన విజయానికి మద్దతుగా బుధవారం సాయంత్రం చేపట్టిన తిరంగా యాత్ర ర్యాలీలో కులమతాలకు అతీతంగా ప్రజలు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో విశేష స్పందన లభించింది. ఈ ర్యాలీ నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లిలోని శ్రీ కృష్ణ గీతా మందిరం నుంచి నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయం వరకు సాగింది. ర్యాలీలో 100 అడుగుల జాతీయ జెండాను ఊరేగించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో మండల ప్రముఖులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు, ప్రజలు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లల సర్వే

గాలివీడు : దివ్యాంగ పిల్లలను గుర్తించుటకు ప్రభుత్వం సర్వేను ప్రారంభించిందని మండల విద్యాధికారి – 2 శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా సర్వేలో 14 సంవత్సరాలలోపు వయసు ఉన్న పిల్లలను గుర్తించుట, వారిని దగ్గరలోని ప్రభుత్వం పాఠశాలల్లో చేర్చుట వారికి సంబంధించిన పథకాల గురించి పూర్తిగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం సర్వే ముఖ్య ఉద్దేశమన్నారు. దివ్యాంగుల పిల్లల్లో భాషా నైపుణ్యాలు పెంపొందించుటకు ఫిజియోథెరపి సేవలు అందించడమే కాక ప్రభుత్వం ద్వారా ఉచిత ఉపకరణాలు అందజేస్తామన్నారు. భవిత కేంద్రంలో పిల్లలను చేర్చాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ సర్వేలో ఐఈఆర్పీ ఖలందర్ పాల్గొన్నారు.

ఇంటింటా చెత్త సేకరణ

పెనగలూరు : మండల కేంద్రంలో ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎంపీడీఓ విజయారావు తెలిపారు. బుధవారం చెత్త సేకరణ సిబ్బందితో పొడి చెత్త, తడి చెత్తలను సేకరించి ఎస్‌డబ్ల్యూ పీసీకి తరలించడం జరిగిందని ఎంపీడీఓ తెలియజేశారు. ప్రజలందరూ తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి గ్రీన్ అంబాసిడర్‌లకు అందించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీ సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దార్శనికుడు రాజీవ్‌గాంధీ



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

రాయచోటి జగదాంబసెంటర్ : భారత మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ గొప్ప దార్శనికుడు అని పీసీసీ జనరల్ సెక్రటరీ షేక్ అల్లాబకాష్ తెలిపారు. బుధవారం రాజీవ్‌గాంధీ 34వ వర్ధంతి సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అల్లాబకాష్ మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ ఏఐసీసీ అధ్యక్షునిగా, భారత ప్రధానిగా దేశానికి ఎనలేని సేవ చేశారని కొనియాడారు.

దామోదర్ సేవలు అభినందనీయం



చిన్నమండెం : మండల కేంద్రంలోనిపోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసిన దామోదర్ సేవలు మరువలేనివని సిబ్బంది కొనియాడారు. దామోదర్ చిన్నమండెంలో ఐదు సంవత్సరాలు విధి నిర్వహణలో నిక్కచ్చిగా పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న దామోదర్‌కు అభినందనలు తెలిపారు.

మంద అభివృద్ధికి విత్తన పొట్టేలే కీలకం

- దృఢంగా ఉన్న జీవాలు సంతానోత్పత్తికి ఉపయోగకరం
- జాతి పొట్టేలైతే మరీ మంచిది
- 25 నుంచి 30 ఆడ గొర్రెలకు ఒక పొట్టేలు తప్పనిసరి



మండలంలో రైతులుకు చెందిన గొర్రెల మంద



గణేష్, పశువైద్యాధికారి, చిన్నమండెం

చిన్నమండెం : గొర్రెల మంద అభివృద్ధిలో పొట్టేలు కీలకం. విత్తన పొట్టేలు మంచిదైతే మందలో గొర్రె పిల్లల సంఖ్య ఏడాది కాలంలోనే 50 నుంచి 70 వరకు పెరుగుతుంది. పొట్టేళ్లకు సంబంధించిన పలు విషయాలను చిన్నమండెం పశువైద్యాధికారి గణేష్ వివరించారు.

జన్యుపరమైన సమస్యలతో జననం

గొర్రెల పెంపకందారులు తమ మందలో పుట్టిన మగ పిల్లలనే విత్తన పొట్టేళ్లుగా వాడతారు. అయితే ఇది సరికాదు. మందలోని పొట్టేలు రక్తసంబంధ సంతతిపై దాటడం వల్ల పిల్లలు జన్యుపరమైన సమస్యలు, అంగవైకల్యంతో జన్మిస్తాయి. రోగ నిరోధకశక్తి తగ్గి వివిధ వాతావరణ పరిస్థితులను తట్టుకోలేక రోగాల బారిన పడతాయి.

మేలు రకం పొట్టేలును ఎంపిక చేసుకోవాలి

గొర్రెల మంద అభివృద్ధి చెందాలంటే మేలు రకం పొట్టేలను ఎంపిక చేసుకోవాలి. కాపరులు తమ ప్రాంతానికి అనువైన జాతిని మాత్రమే ఎంచుకోవాలి. విత్తన పొట్టేలు జాతి లక్షణాలు కలిగి, ఆడ గొర్రెలపై దాటడానికి మంచి లైంగికాసక్తితో ఉండాలి. శరీరం దృఢంగా, చురుగ్గా ఉండాలి. కాళ్లు నిటారుగా, బలంగా, గిట్టలు చక్కగా, కళ్లు మెరుస్తుండాలి. వృషణాల వెనుక కాళ్ల మధ్య సరిసమానంగా శరీరానికి దగ్గరగా ఉంటే సంతానోత్పత్తికి ఉపయోగకరంగా ఉంటాయి. పొట్టేలు కనీసం 18 నెలల వయస్సుండి రెండు నుంచి నాలుగు పళ్లతో ఉండాలి. అలాగే విత్తన పొట్టేలును గ్రామంలోని పక్కనున్న మందలు, పక్క గ్రామం, పొరుగు జిల్లా నుంచి ఎంపిక చేసుకోవాలి. బయటి నుంచి తీసుకువచ్చే పొట్టేళ్లకు బ్రూసెల్లోసిస్ వ్యాధి పరీక్షలు చేయించాలి.

రెండేళ్లకోసారి మార్చాలి

విత్తన పొట్టేలును రెండేళ్లకోసారి తప్పనిసరిగా మార్చాలి. ప్రతి 25 నుంచి 30 ఆడ గొర్రెలకు ఒక విత్తన పొట్టేలు ఉండేలా చూసుకోవాలి. సాధ్యమైనంత వరకు కవల పిల్లగా పుట్టిన పొట్టేలును ఉపయోగించాలి. గొర్రెలపై దాటుడు కాలంలో పొట్టేలు శరీర పైభాగంలో ఉండే వెంట్రుకలు కత్తిరించి, నునుపుగా ఉంచాలి. దాటుడు కాని సమయంలో పొట్టేలును మందకు దూరంగా ఉంచాలి.

దాణా విషయంలో జాగ్రత్త

పొట్టేళ్లకు మేత, దాణా, వసతి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన వాటిని వారం రోజులు ఇంటి వద్దే మేపిన తర్వాత మందలో కలపాలి. రోజుకు 200 గ్రాముల మిశ్రమ దాణా అందించాలి. జొన్న, తవుడు, నూకలు, వేరుశనగ చెక్కతో తయారు చేసిన మిశ్రమ దాణాను కొద్దిగా నీళ్లతో తడిపి పొడిపొడిగా చేసి పెట్టాలి. వారం తర్వాత చిటుకు వ్యాధి టీకా వేయించాలి.

24న ఆంజనేయస్వామి తిరునాల



పూజలందుకున్న అంజన్న

సుండుపల్లె : మండల పరిధిలోని చిన్నగొల్లపల్లి గ్రామ పంచాయతీ సమీపంలో మర్రిచెట్టు దగ్గర వెలసిన ఆంజనేయస్వామి తిరునాల మహోత్సవాన్ని ఈ నెల 24న (శనివారం) నిర్వహిస్తున్నట్లు వైఎస్ఆర్ సీపీ చిన్నగొల్లపల్లి గ్రామ సర్పంచ్ రామాజయచంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయాన్నే స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేయనున్నట్లు చెప్పారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విద్యుత్ దీపాలంకరణతో చాందినీబండ్లు ప్రదక్షిణలు చేస్తాయన్నారు. మండలంలోని ప్రజలందరూ స్వామి వారిని దర్శించుకుని తిరునాలను తిలకించవలసిందిగా ఆయన కోరారు.

హనుమాన్ జయంతికి ముస్తాబైన ఆలయాలు



పుల్లంపేట: కోటగడ్డలోని అభయాంజనేయస్వామి

చిట్వేలి : హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మండలంలోని ఆలయాలు, విగ్రహాల వద్ద పండుగ వాతావరణం నెలకొంది. అన్ని ప్రాంతాలలో విద్యుత్ దీపాలతో అలంకరించారు. చిట్వేలి వద్ద వెలసి ఉన్న శ్రీ సంజీవరాయ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త మాదినేని రామచంద్రయ్య స్వామి తెలియజేశారు. అలాగే చెర్లోపల్లి క్రాస్ రోడ్డు వద్ద తిమ్మాయపాలెం క్రాస్ రోడ్డు వద్ద శ్రీ దత్తనారాయణ తపోవన ఆశ్రమ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హనుమాన్ విగ్రహం వద్ద చిట్వేలి, రాజంపేట రోడ్డులో తిమ్మయ్యగారిపల్లి హనుమాన్ విగ్రహం వద్ద, అలాగే చిట్వేలి బ్రాహ్మణ వీధిలో వెలసి ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకులు చెప్పారు.

పుల్లంపేట : పుల్లంపేట మండల వ్యాప్తంగా ఉన్న ఆంజనేయస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. పుల్లంపేట, రెడ్డిపల్లి, పెరియవరం కోటగడ్డలలోని స్వామి వారి ఆలయాలలో స్వామివారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహకులు తెలిపారు. కోటగడ్డపై వెలసిన శ్రీ అభయాంజనేయస్వామి దేవస్థానం నందు స్వామివారి అభిషేకం అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియజేశారు.

కూటమి స్వార్థ నిర్ణయాలతో ప్రజలకు ఇబ్బందులు



మాట్లాడుతున్న శిబ్యాల విజయభాస్కర్

రాయచోటి టౌన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలను తిప్పలు పెట్టే కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి శిబ్యాల విజయభాస్కర్ ఆరోపించారు. బుధవారం రాయచోటి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. లబ్ధిదారుడి ఇంటి వద్దకే రేషన్ బియ్యం అందించేలా వైఎస్ జగన్ చర్యలు తీసుకున్నారని అలాంటి పథకాన్ని రద్దు చేసే నిర్ణయం కూటమి ప్రభుత్వం తీసుకోవడం దుర్మార్గమన్నారు. ఈ నిర్ణయంతో సామాన్యులు అవస్థలు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీకి 10 – 15 పల్లెలు ఉంటాయని అలాంటి గ్రామాలకు ఒక్కరే డీలర్ ఉండటం వలన సామాన్యులు పనులు మానుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ప్రజల శ్రేయస్సును కాంక్షించి సీఎంగా వైఎస్ జగన్ తీసుకొచ్చిన పలు నిర్ణయాలను రాష్ట్రంలో అమలులో లేకుండా చేయాలనే తీరుతో రాబోయే రోజుల్లో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పవన్నారు. స్వార్థ రాజకీయ నిర్ణయాలతో ప్రజలను అవస్థలకు గురిచేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వైఎస్ అనే పేరు రాష్ట్రంలో ఎక్కడా ఉండకూడదనే వైఖరితో ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, వైఎస్ జగన్ అమలు చేసిన అమ్మఒడి తదితర పథకాలను తొలగించే దమ్ము ఉందా అని సవాల్ విసిరారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను పట్టించుకోకుండా ఇప్పుడు వారి వెన్ను విరిచేలా పాలన సాగిస్తుండటంపై ధ్వజమెత్తారు. కూటమి నిరంకుశ పాలనను ప్రతి ఒక్కరికి తెలియజేసి వారి వైఖరిని ఎండగడతామని తెలియజేశారు.

ప్రజలను వంచించడమే చంద్రబాబు నైజం



మాట్లాడుతున్న పాపినేని విశ్వనాథరెడ్డి

రాజంపేట టౌన్ : ఎన్నికల సమయంలో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపి ఆ తరువాత ప్రజలను వంచించడం చంద్రబాబునాయుడుకు వెన్నతో పెట్టిన విద్య అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వం రేషన్ సరుకులు ఇంటింటి పంపిణీని నిలిపివేయడం పట్ల పాపినేని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ తన హయాంలో ప్రజలకు, ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, దినసరి కూలీలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఇంటి వద్దనే రేషన్ సరకులను పంపిణీ చేసేందుకు ఎండీయూ వాహన వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. అయితే చంద్రబాబునాయుడు జగన్ తీసుకొచ్చిన వ్యవస్థను తాను కొనసాగించకూడదన్న దుర్బుద్ధితో ఇంటింటికి రేషన్ పంపిణీని రద్దు చేయడం అనాలోచితమన్నారు. దీంతో ప్రజలు అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. బాబు తన నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజలను ఇబ్బందులు పెట్టడం తప్పా ఏమీ కనిపించదన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు నిజస్వరూపాన్ని ప్రజలు గమనించి వచ్చే ఏడాది జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి గట్టి బుద్ధి చెప్పాలని కోరారు.

దుర్లభంగా మారనున్న ఎండీయూ ఆపరేటర్ల జీవితాలు

రాష్ట్రంలో ఎండీయూ వాహనాలపై వేలాది మంది ఆపరేటర్లు, సిబ్బంది ఆధారపడి జీవిస్తున్నారని, ఇప్పుడు ఎండీయూ వాహనాల ద్వారా రేషన్‌ను నిలిపివేయడంతో వేలాది కుటుంబాలు వీధిన పడే పరిస్థితి నెలకొందని విశ్వనాథరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నఫళంగా ఆపరేట్లు, సిబ్బంది నోటికాడి కూడు తీసిన సీఎం చంద్రబాబు నాయుడుకు వారి ఉసురు తగలక తప్పదన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ దండు గోపి, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు కల్యాణ్‌రెడ్డి, దాసరి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై అన్నదమ్ముల దాడి



వీరబల్లి : మండలంలోని తాటికుంట పల్లి గ్రామం షికారు పాలెంకు చెందిన రవికుమార్‌పై అదే గ్రామానికి చెందిన రమేష్ కుమార్, అతని అన్నదమ్ములు కలిసి దాడి చేశారు. దీంతో రవికుమార్ తలకు బలమైన గాయం తగలడంతో చికిత్స కోసం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాడు. అనంతరం వీరబల్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేయడంతో దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరసింహారెడ్డి తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు



ఆదర్శ రైతులను సత్కరిస్తున్న అధికారులు

చిన్నమండెం : ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో సాగు చేయడం వలన అధిక లాభాలు పొందవచ్చని వీఏఏ శేషమ్మ తెలిపారు. మండల పరిధిలోని పడమటికోన గ్రామంలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై బుధవారం అవగాహన నిర్వహించారు. అనంతరం ఆదర్శ రైతులు రాజారెడ్డి, కళావతమ్మలను ఘనంగా సత్కరించారు. అనంతరం పీఎండీఎస్ వేయడం వలన కలిగే లాభాలు, ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎంటీఎల్ చందురెడ్డి, స్టేట్ వైపీ ఆదిత్యపవన్‌రెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి రెడ్డికళావతి, ఐసీఆర్‌పీలు శివారెడ్డి, ధర్మారెడ్డి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల కన్వీనర్లు నియామకం

ఓబులవారిపల్లె : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేర బుధవారం రైల్వేకోడూరు నియోజకవర్గ అనుబంధ విభాగాలకు సంబంధించి అధ్యక్షుల నియామకాలను కేంద్ర పార్టీ కార్యాలయం ప్రకటించింది. రైల్వేకోడూరు మహిళా అధ్యక్షురాలిగా నారాయణమ్మ, యూత్‌వింగ్ అధ్యక్షుడిగా శివకుమార్, రైతు విభాగం అధ్యక్షుడిగా కంచర్ల ఆంజనేయులు రెడ్డి, బీసీ సెల్ కన్వీనర్‌గా ఎస్.ప్రభాకర్, ఎస్సీ సెల్ కన్వీనర్‌గా తిప్పన దుర్గయ్య, ఎస్టీసెల్ కన్వీనర్‌గా పి.రత్నమ్మ, మైనార్టీ సెల్ కన్వీనర్‌గా షేక్ మదనపల్లి రౌఫ్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ కన్వీనర్‌గా బత్తల ప్రదీప్ రాజకుమార్, స్టూడెంట్ వింగ్ కన్వీనర్‌గా లక్కిరెడ్డిపల్లి మౌనేంద్ర కుమార్ రెడ్డి, పంచాయతీ రాజ్ వింగ్ కన్వీనర్‌గా మూరి శివశంకర్ రెడ్డి, ఆర్‌టీఐ వింగ్ కన్వీనర్‌గా ఎనమల చైతన్య, వలంటీర్స్ వింగ్ కన్వీనర్‌గా పుచ్చకాయల శివ శంకర్, గ్రీవెన్స్ సెల్ కన్వీనర్‌గా గంగరాజు, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా గునిశెట్టి రమేష్‌బాబు, వీవర్స్ వింగ్ కన్వీనర్‌గా సారథి వైఎస్సార్‌టీయూసీ శిగమల సతీష్ రెడ్డి, లీగల్ సెల్ కన్వీనర్‌గా సిద్ధలింగం మధుసూదన్ రావు, కల్చర్ వింగ్ కన్వీనర్‌గా పాణ్యం జయరామ్, సోషల్ మీడియా వింగ్ కన్వీనర్‌గా దామర్ల సాయి గణేష్, ఐటీ వింగ్ కన్వీనర్‌గా బొమ్మన సుబ్రమణ్యం, దివ్యాంగుల విభాగానికి జె.నరసింహులు, డాక్టర్స్ వింగ్ కన్వీనర్‌గా ఓబిలి వెంగల్ రెడ్డి, ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడిగా జై మోహన్ ప్రసాద్ గౌడ్, బూత్ కమిటీ వింగ్ కన్వీనర్‌గా తిప్పన నాగభూషణం, పబ్లిసిటీ వింగ్ ఇన్‌చార్జ్‌గా దాడిశెట్టి సుదర్శన్‌లను నియమించారు.

జర్నలిస్టులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న పల్లేటి రామసుబ్బారెడ్డి

రాజంపేట రూరల్ : సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషిచేసే జర్నలిస్టులు వృత్తితో పాటు వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పల్లేటి రామసుబ్బారెడ్డి కోరారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఏపీయూడబ్ల్యూజే, రాజంపేట ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో పల్లేటి రామసుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన హెల్త్ స్కీంకు రూ.1250 చెల్లిస్తే రూ.2లక్షల వరకు వైద్య సేవలు పొందవచ్చన్నారు. మరో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏరియా సుపత్రి సూపరింటెండెంట్ పీవీ నాగేశ్వరరాజు మాట్లాడుతూ ప్రతి 6 నెలలకు ఒక పర్యాయం జర్నలిస్టుల కోసం ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. జర్నలిస్టులు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్నారని కొనియాడారు. వారి ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహించరాదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి ఆర్ఎం డాక్టర్ సి.అనిల్‌కుమార్, డాక్టర్ హబీబ్, నర్సింగ్ సూపరింటెండెంట్ టీఎస్ సత్యసాయి లీలమ్మ, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షులు బచోటి భాస్కర్, తాలూకా అధ్యక్షులు ఇండ్లూరి చిన్న వెంకటరెడ్డి, గౌరవ అధ్యక్షులు ఎం.సుబ్బనరసింహులు, కమిటీ సభ్యులు తుపాకుల సురేష్, కొత్తపల్లి గణేశ్, ఉదయగిరి కల్యాణ్, పాలెంపల్లి కార్తిక్, మండ్ల శ్రీహరీ, మందా శివయ్య, శివయ్యనాయుడు, ఓబులేసు, కోశాధికారి సునీల్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో హనుమజ్జయంతి ఏర్పాట్లు పూర్తి



మంగంపేట వీరాంజనేయస్వామి

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట మండలంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని చింతరాజుపల్లి, మంగంపేట, పెద్దకొత్తపల్లి, ఒంటిమిట్టలోని చెరువు కట్టపై వెలసిన వీరాంజనేయస్వామి, ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయం ఎదురుగా ఉన్న భక్త సంజీవరాయస్వామి ఆలయాల వద్ద అంజన్న జయంతి వేడుకలు జరుగుతాయి. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

యోగాతోనే ఆరోగ్యం

యోగా సాధనతో ఆరోగ్యవంతులుగా అవ్వచని మండలాధికారులు తెలిపారు. జూన్ 21న యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో యోగాంధ్ర కార్యక్రమాన్ని అన్ని మండలాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొని యోగాసనాలు వేశారు. నెల రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలకు యోగా విశిష్టతను తెలియజేయాలని ఎంపీడీఓలు సిబ్బందికి ఆదేశించారు. – సాక్షి, నెట్‌వర్క్



పెనగలూరు: ఎంపీడీఓ కార్యాలయంలో యోగా చేస్తున్న అధికారులు



సుండుపల్లె: ఎంపీడీఓ కార్యలయంలో యోగా చేస్తున్న వివిధ శాఖల అధికారులు



సంబేపల్లె : యోగాసనాలు వేస్తున్న అధికారులు



చిట్వేలి: మాట్లాడుతున్న ఎంపీడీఓ మోహన్



ఓబులవారిపల్లె: ఎంపీపీ కార్యాలయంలో..

ఆధ్యాత్మిక వైభవం.. అభివృద్ధికి అందలం

- గత ప్రభుత్వంలో వివిధ ఆలయాల నిర్మాణానికి నిధులు
- నిర్మాణం పూర్తయిన పలు ఆలయాలు, ముగింపు దశలో మరికొన్ని



లక్కిరెడ్డిపల్లె మండలం అనంతపురం గంగమ్మ ఆలయం వద్ద నిర్మించిన సిమెంటు రోడ్డు



రాచపల్లి గ్రామం నాయునివారిపల్లెలో నిర్మాణం పూర్తయిన వీరనాగమ్మ ఆలయం

లక్కిరెడ్డిపల్లి : గ్రామాలను ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలన్న గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సంకల్పానికి అప్పటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక చొరవ, పట్టుదల, కృషితో నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఆలయాల నిర్మాణాలకు అడుగులు పడ్డాయి. ఇందుకు ప్రభుత్వ నిధులతోపాటు టీటీడీ ఆధ్వర్యంలో ఉండే శ్రీ వాణి ట్రస్టు నుంచి నిధులు మంజూరు చేయించి గ్రామాలకు ఆధ్యాత్మిక శోభ సంతరించుకునేలా చర్యలు చేపట్టారు. రామాపురం మండలంలో సీజీఎఫ్ నిధులతో నాలుగు ఆలయాల నిర్మాణాలకు రూ.1.2 కోట్లు, శ్రీవాణి ట్రస్టు ద్వారా పదకొండు ఆలయాలకు రూ.1.10 కోట్లు, లక్కిరెడ్డిపల్లి మండలంలో అనంతపురం గంగమ్మ ఆలయానికి రూ. 25 లక్షలతో సిమెంట్ రోడ్, శ్రీవాణి ట్రస్టు ద్వారా నాలుగు ఆలయాలకు రూ. 40 లక్షలు నిధులను మంజూరు చేయించారు. దాతలు, ప్రజలు, భక్తులను భాగస్వాములను చేసి సదరు ఆలయాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించడంలో శ్రీకాంత్ రెడ్డి సఫలీకృతులయ్యారు. ఆలయాల అభివృద్ధికి గడికోట చేసిన కృషిని రామాపురం, లక్కిరెడ్డిపల్లి మండలాల ప్రజలు మననం చేసుకుంటూ అభినందిస్తున్నారు. రామాపురం సీజీఎఫ్ నిధులతో సుద్దమళ్ల గ్రామం ఓబుల్‌రెడ్డిగారిపల్లిలో శ్రీరామదూత అభయహస్త ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి రూ. 22 లక్షలు, సుద్దమళ్ల గ్రామం చింతలవాండ్లపల్లిలో శ్రీ కోదండ రామాలయం పునఃనిర్మాణానికి రూ. 20 లక్షలు, నల్లగుట్టపల్లిలో రామాలయం రూ. 40 లక్షలు నిధులు మంజూరయ్యాయి. నిర్మాణ పనులు వివిధ దశలలో ఉన్నాయి. కల్పనాయుని చెరువు మూలపల్లిలో శ్రీ కోదండరామాలయం, మూలపల్లిలో ఆలయాలకు రూ. 20 లక్షల మేర నిధులు మంజూరయ్యాయి.

శ్రీవాణి ట్రస్టు టీటీడీ ద్వారా...

రాచపల్లి గ్రామం, బాలిరెడ్డిగారిపల్లి బీసీ కాలనీలో కోదండ రామాలయం, నాయునివారిపల్లి బీసీ కాలనీలో వీరనాగమ్మ ఆలయం, బండపల్లి గ్రామం పొత్తకూరుపల్లి మాలపల్లిలో రామాలయం, భయనేని హరిజనవాడలో రామాలయం, సుద్దమళ్ల గ్రామం, ఎస్సీ కాలనీలో రామాలయం, కల్పనాయుని చెరువు ఊరమాదిగపల్లిలో సీతారామాలయం, గోపగుడిపల్లి బీసీ కాలనీలో శివాలయం, హసనాపురం పెద్దబల్లివాండ్లపల్లిలో రామాలయం, సూర్యనారాయణపురంలో ఆంజనేయస్వామి ఆలయం, గువ్వలచెరువులో రామాలయం, మేదరపల్లిలో రామాలయం. లక్కిరెడ్డిపల్లె మండలం బి.యర్రగుడి గ్రామం చెంచర్లపల్లిలో శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయం, ఎస్సీ కాలనీలో రామాలయం, కస్తూరిరాజుగారిపల్లి ఎస్సీ కాలనీ రామాలయం, పందిళ్లపల్లి గ్రామం కోతలగుట్టపల్లి రామాలయం నిర్మాణాలకు నిధులు మంజూరు చేయించడంలో అప్పటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి విశేష కృషి చేశారు. ప్రస్తుతం కొన్ని ఆలయాల నిర్మాణాలు పూర్తి కాగా మరి కొన్ని ఆలయాల పనులు ముగింపు దశలో ఉన్నాయి. పనులు పూర్తయితే ఆయా గ్రామాలకు ఆధ్యాత్మిక ప్రభ సంతరించుకోనుంది.

నీటి కోసం నానా అవస్థలు



నిరసన తెలుపుతున్న చలమారెడ్డి కొట్టాలకు చెందిన మహిళలు



పక్క గ్రామాలకు ఆటోలో వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్న గ్రామస్తులు

సిద్దవటం : మండలంలోని చలమారెడ్డి కొట్టాల గ్రామంలో గత 5 రోజులుగా తాగునీటి సమస్య నెలకొని ఉండటంతో బుధవారం స్థానిక మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు మాట్లాడుతూ చలమారెడ్డి కొట్టాల గ్రామంలో బీసీ, ఎస్సీ కాలనీలలో గత 5 రోజులు నుంచి తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పక్క గ్రామాలైన జ్యోతి, పి.కొత్తపల్లె, వెంకటయాపల్లె గ్రామాలకు ఆటోలలో వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నామన్నారు. అంతేగాకుండా విద్యుత్ సమస్య కూడా ఉందని ఈ వర్షాలకు రాత్రి వేళల్లో దోమలు విపరీతంగా ఉన్నాయని కంటి నిండా నిద్రలేకుండా పోతోందన్నారు. ఉన్నతాధికారులైనా స్పందించి తమ గ్రామానికి విద్యుత్, తాగునీటి సౌకర్యాలను కల్పించాలని గ్రామస్తులు అధికారులను వేడుకుంటున్నారు.

పరీక్షలు ప్రారంభం

కురబలకోట : ఈఏపీసెట్–25 బుధవారం నుంచి అంగళ్లు మిట్స్, విశ్వం ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రారంభమయ్యాయి.